క్లుప్తంగా

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

సామర్లకోట: మండలంలోని సచివాలయాల్లో బుధవారం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు ప్రారంభించినట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉండూరు-1, మాధవపట్నం-1, వేట్లపాలెం-1 సచివాలయాల్లో నిర్వహించామన్నారు. 26న పి.వేమవరం, అచ్చంపేట, వేట్లపాలెం-2 సచివాలయం, 27న చంద్రంపాలెం, పనసపాడు, వేట్లపాలెం-3 సచివాలయం, 28న పవర, గొంచాల, వేట్లపాలెం-4 సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రహదారి నాణ్యత పరిశీలన


రహదారి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు నుంచి శంఖవరం మండలం కత్తిపూడి వెళ్లే పుంత రోడ్డులో నిర్మించిన రహదారి నాణ్యతను అధికారులు బుధవారం పరిశీలించారు. ప్రాజెక్టు డీఈ రామకృష్ణ, ఏఈ వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో రోడ్డును పరిశీలించారు. వారి వెంట ప్రాజెక్టు సిబ్బంది ఉన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న దాతలు

పిఠాపురం: హైదరాబాద్‌కు చెందిన ఆర్వీ అసోసియేట్స్ ఆర్కిటెక్స్ ఇంజినీర్స్ అండ్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆర్థిక సాయంతో గొల్లప్రోలు బాలుర ఉన్నత ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. సంస్థ ఎండీ రెడ్ల నాగూరయ్య, వెంకటయ్యమ్మ కుమారుడు రెడ్ల వెంకటాచల చక్రపాణి, రెడ్ల నారాయణమూర్తి ఈ నిర్మాణానికి భూమి పూజ చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు జ్యోతుల భీముడు, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం


స్వాములకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేటలో కొలువైన విజయ జనార్దనస్వామి ఆలయం వద్ద బుధవారం అయ్యప్ప స్వాములకు అన్నదానం జరిగింది. ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నదానాన్ని ప్రారంభిస్తూ ప్రతి ఒక్కరూ భక్తి తత్వాన్ని పెంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రూ.25 వేల విరాళం అందజేశారు. ఈ ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాస్, కాజులూరి నెర్లేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్ సదస్సుకు కమిషనర్

కాకినాడ: కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శ్రీనగర్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు కాకినాడ స్మార్ట్ సిటీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు వెళ్లారు. గురు, శుక్రవారాల్లో జరగనున్న స్మార్ట్ సిటీల వర్క్ షాప్ ఆయన పాల్గొననున్నారు. బహిరంగ ప్రదేశాలను ప్రజలకు ప్రయోజనకరంగా సౌకర్యవంతంగా తీర్చిదిద్దడం, సైకిల్ 4 చాలెంజ్, ఈట్ స్ట్రీట్‌ల అభివృద్ధి వంటి అంశాలపై ఈ సదస్సు జరగనుంది. ఆయా స్మార్ట్ సిటీలలో ఇప్పటికే అమలవుతున్న అభివృద్ధి పనులపైనా, భవిష్యత్ కార్యాచరణపైనా సదస్సులో చర్చించనున్నారు.

నేటి నుంచి ఆర్టీసీ కార్గో వారోత్సవాలు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి నవంబర్ 25వ తేదీ వరకు నెల రోజుల పాటు కార్గో డోర్ డెలివరీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ముఖ్య నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాలకు 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వారికి పార్శిల్, కవర్లను చాలా తక్కువ సమయంలో డోర్ డెలివరీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు డోర్ డెలివరీపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు కోరారు. పార్శిల్/కొరియర్ ధరల వివరాలను వివరించారు. ఒక కిలోకు రూ.18లు, ఒకటి నుంచి ఆరు కిలోల వరకు రూ.30, ఆరు నుంచి పది కిలోల వరకు రూ.36లు, పది నుంచి 25 కిలోల వరకు రూ.48లు, 25 నుంచి 50 కిలోల వరకు రూ.59లు ధరలు నిర్ణయించినట్లు తెలిపారు.

చదువు ఆపేసిన వారికీ ఓపెన్

- ఉపాధి అవకాశాలు పెంచుతున్న ఓపెన్ స్కూల్
- ప్రభుత్వ ఉద్యోగాల్లో పదోన్నతులు
- ఇంటర్ సీట్లకు మరింత డిమాండ్


ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

సామర్లకోట: వివిధ కారణాల వల్ల చదువు నిలిపివేసి.. తిరిగి పాఠశాలలో చేరే అవకాశం కోల్పోయిన వారికి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరలా చదువుకొనే అవకాశం కల్పించారు. ఇందులో భాగంగానే ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశ పెట్టారు. వయస్సు నిర్ధారణ, చదువుకున్న ధ్రువపత్రాలుంటే ఓపెన్ స్కూల్‌లో చేరి, పదో తరగతి సర్టిఫికెట్ పొందే అవకాశముంది. విద్య ప్రారంభించని వారు 14 ఏళ్లు నిండి ఉంటే, ఓపెన్ స్కూల్‌లో చేరి తమ ప్రతిభను చూపే అవకాశం ఉంది. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 2008లో పదో తరగతి, 2011లో ఇంటర్‌కు అవకాశం లభించింది. ఇప్పటివరకు ఓపెన్ స్కూల్‌లో పదో తరగతిలో 918 మంది, ఇంటర్‌లో 486 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఓపెన్ స్కూల్‌లో చేరిన విద్యార్థులు ఫెయిలైతే ఏడాదికి రెండు పర్యాయాల వంతున ఐదేళ్ల పాటు పరీక్షలు రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దాంతో పదో తరగతిలో 902 మంది, ఇంటర్‌లో 476 మంది ఉత్తీర్ణత సాధించారని ఓపెన్ స్కూల్ కన్వీనర్ తోటకూర సాయి రామకృష్ణ తెలిపారు.

పాఠశాల సర్టిఫికెట్‌తో సమానం

పాఠశాలలో పదో తరగతికి సమానంగా ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లకు అర్హత ఉంది. దీంతో ఆయా ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు.. ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించి పదోన్నతులు పొందుతున్నారు. దాంతో ఓపెన్ స్కూల్‌కు డిమాండ్ పెరిగింది. ఓపెన్ స్కూల్‌లో పదో తరగతిలో చేరడానికి 100 సీట్లు, ఇంటర్‌లో కేవలం 40 సీట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. అయితే పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్‌లో చేరడానికి సుముఖత చూపడంతో, దీనికి కూడా డిమాండ్ పెరిగింది. ఈ సీట్ల సంఖ్యను కూడా పెంచాలని ఓపెన్ స్కూల్ విద్యార్థులు కోరుతున్నారు.

సెలవు రోజుల్లో తరగతులు

ఓపెన్ స్కూల్‌ను కేవలం సెలవు రోజుల్లో మాత్రమే క్లాసులు నిర్వహిస్తున్నారు. ఆదివారంతో పాటు రెండో శనివారం, ఇతర ప్రభుత్వ సెలవు దినాల్లోను క్లాసులు నిర్వహిస్తారు. దీని కోసం పాఠశాల హెచ్ఎం కోఆర్డినేటర్‌గా, సీనియర్ ఉపాధ్యాయుడు అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. ఓపెన్ స్కూల్‌లో ఆయా సబ్జెక్టుల బోధనకు ఉత్సాహం చూపేవారికి తరగతులు కేటాయిస్తున్నారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తోంది. ఓపెన్ స్కూల్‌లో చేరడానికి ఇప్పటి వరకు పదో తరగతికి 48, ఇంటర్‌కు 40 దరఖాస్తులు వచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో చేరడానికి ఈ నెలాఖరులోగా ఫీజు చెల్లించాల్సి ఉంది.

సీనియర్ అసిస్టెంట్‌గా అవకాశం



బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లోని ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేశాను. ప్రైవేటుగా డిగ్రీ కట్టడంతో మున్సిపల్ కార్యాలయంలో చైన్‌మెన్‌గా ఉన్న నాకు సీనియర్ అసిస్టెంట్‌గా అవకాశం లభించింది. మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ మంచి అవకాశం.

– బంగారు అప్పారావు, మున్సిపల్ ఉద్యోగి, సామర్లకోట

ఉపాధి చూపించింది



చదువుకోక పోవడంతో గృహిణి అయిన నేను ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేయడంతో వికాసలో ఆఫీసు అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. దాంతో ఓపెన్ స్కూల్‌లో ఇంటర్ కూడా పూర్తి చేశాను. ఓపెన్ స్కూల్‌లో ప్రతి సబ్జెక్టు అర్థమయ్యేలా చెప్పడంతో సులభంగా పాస్ అయ్యాను.

– పి.దుర్గాభవాని, గృహిణి, సామర్లకోట

విధిగా తరగతులకు హాజరవ్వాలి



సెలవు రోజుల్లో నిర్వహించే ఓపెన్ స్కూల్‌లో కనీసం 30 రోజులు హాజరు కావాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజులతో కలిపి పదో తరగతికి రూ.1,550, ఇంటర్‌కు రూ.1,800 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు పదో తరగతికి రూ.1,150, ఇంటర్‌కు రూ.1,500 చెల్లించాలి. వివరాలకు నేరుగా ఓపెన్ స్కూల్‌లో సంప్రదించాలి.

– తోటకూర సాయిరామకృష్ణ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, సామర్లకోట

సమస్యలను సత్వరం పరిష్కరించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ స్పందన హాలులో బుధవారం డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం డీఎస్పీ లతాకుమారితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్‌కు సంబంధించి 12 మండలాల పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి కేసుల్లో ఎఫ్ఐఆర్ స్టేజ్‌లలో 124, చార్జ్‌షీట్‌ల్లో 72, పోస్టుమార్టమ్ స్టేజ్‌లో రెండు కేసులు వెరసి రూ.1.56 కోట్లు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసిందన్నారు. అనంతరం మండలాల వారీగా కేసుల వివరాలపై సమీక్ష చేస్తూ అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసు పూర్వాపరాలు పూర్తయ్యే బాధితులకు న్యాయం జరిగే వరకూ సిబ్బందిదే బాధ్యతన్నారు. సమావేశంలో తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్, డివిజన్‌లోని నాలుగు నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు మోకా పవన్ కుమార్, డోకుబుర్ర భద్రం, త్రినాథ్‌దేవ్, పిల్లి జ్యోతి, డివిజన్ కమిటీ సభ్యులు దడాల బాబ్జి, గారా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భేతాళ సంబరం


వేట్లపాలెం భేతాళ సంబరంలో భక్తులు


పీబీ దేవంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న ప్రజలు

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

సామర్లకోట: వేట్లపాలెంలో ప్రసిద్ధి చెందిన భేతాళ సంబరం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి దర్శనానికి వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. గ్రామ శివారు నుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠించిన భేతాళస్వామిని తిరిగి అక్కడకు తీసుకువెళ్లి పూడ్చి వేయడానికి సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వామివారు తమ ఇళ్ల వద్దకు రావడంతో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి భేతాళస్వామి ఆలయం వద్ద బాణసంచా కాల్పుల పోటీలు జరిగాయి. వీటిని తిలకించడానికి అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కమిటీ సభ్యులు కొండపల్లి సూరన్న చౌదరి, కొండపల్లి జగ్గారావు, కొండపల్లి కృష్ణమూర్తి, నున్నా వెంకట్రాజు, గోలి శ్రీరామ్, గుణ్ణం సురేష్, కొండపల్లి కొండలరావు, దేసిన బోసు తదితరులు భక్తులకు సేవలందించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పీబీ దేవంలో అన్నసమారాధన

పీబీ దేవంలోని శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా సేవా సమితి ఆధ్వర్యంలో పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సభ్యులు తోటకూర గంగాధర్, వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, విశ్వనాథ్, టీవీవీ సత్యనారాయణ, నువ్వుల సూర్యచంద్రరావు, తాడాల దొరబాబు, నువ్వుల బాబ్జి సేవలందించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- మూలపేటలో గడప గడపకూ..


మూలపేటలో చేనేత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ప్రతి పక్షాలు ఎన్ని ఆటంకాలు, కుట్రలు, కుతంత్రాలు పన్నినా పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ, సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పేర్కొన్నారు. మండలంలోని మూలపేటలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యేకు సర్పంచ్ కంబాల మౌనిక, ఎంపీటీసీలు అద్దా పాప, గోగు లోవకుమారి స్వాగతం పలికి పూలమాల, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరుగుతూ పేరుపేరునా ఆప్యాయంగా పలకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పేర్కొన్న డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పని తీరును ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగనన్న నేతన్న నేస్తం పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికీ సంవత్సరానికి రూ.24 వేలు అందించనున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ఎక్కడని ప్రశ్నించారు. పార్టీలు, కుల, మత అనే భేదాలు లేకుండా అర్హులందరికీ వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన చంద్రబాబునాయుడికి ఏదో ఒక విధంగా అధికారం కట్టబెట్టాలన్న ఆలోచనతో పచ్చ మీడియా చేస్తున్న కుటిల ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా అర్హులందరికీ ఇళ్లస్థలాల పట్టాలను అందించి ఇళ్ల నిర్మాణాలకు రుణాలను మంజూరు చేస్తున్నారని, ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కంబాల లక్ష్మణరావు, అద్దా త్రిమూర్తులు, గోగు జగన్నాథం, కంబాల శ్రీరాములు, సిద్ధి సత్యనారాయణ, గుంటుకు సత్తిబాబు, ధోనిపూడి బాబూరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు, సర్పంచ్ పులి జయబాబు, నక్క మణికంఠ బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్‌బ్యాంకులో లిఫ్ట్ ప్రారంభం


సత్యనారాయణన్‌ను సత్కరిస్తున్న బ్లడ్‌బ్యాంక్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ బ్లడ్‌బ్యాంక్‌లో సుమారు 6 లక్షలతో నూతనంగా నిర్మించిన కొత్త లిఫ్ట్‌ను రోటరీ మాజీ గవర్నర్లు, ఎస్‌వీఎస్ రావు, ఎల్ సత్యనారాయణన్ బుధవారం ప్రారంభించారు. రక్తదాతలకు ఈ సౌకర్యం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బ్లడ్‌బ్యాంక్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ నిట్టాల వెంకట రామారావు తమ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ. 5 లక్షలు సమకూర్చగా మిగిలినవి బ్లడ్‌బ్యాంక్ నుంచి మంజూరు చేశామన్నారు. సీఎస్సార్ నిధులు రావడానికి కృషి చేసిన రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ మాజీ అధ్యక్షులు జీవీ కృష్ణప్రకాష్ కృషి మరువలేనిదన్నారు. అనంతరం ముఖ్య అతిథులను బ్లడ్ బ్యాంక్ తరపున సత్కరించి జ్ఞాపిక అందించారు. బ్లడ్‌బ్యాంక్ కార్యదర్శి చార్మినార్ వర్మ, క్లబ్ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ, కార్యదర్శి చందు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌పీఎఫ్ కార్యాలయ నిర్మాణానికి భూమిని కేటాయించండి


కలెక్టర్ కృతికా శుక్లాను కలసిన శ్రీనివాసరావు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం కాకినాడ యూనిట్ అసిస్టెంట్ కమాండెంట్ బసవ శ్రీనివాసరావు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం నిర్మాణానికి, శిక్షణ సంస్థను నెలకొల్పడానికి జిల్లాలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కలెక్టర్ కృతికా శుక్లాను కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమైన ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ఎస్‌పీఎఫ్ కీలక భూమిక పోషిస్తున్నట్లు వెల్లడించారు. ఓఎన్‌జీసీ, హెచ్‌పీహెచ్‌టి గాడిమొగ, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ గాడిమొగ, ఓఎన్‌జీసీ ఓడలరేవు, కాకినాడ పోర్టు, యూబీవీసీసీ కాకినాడ, ఓఎన్‌జీసీ ఎస్‌టీసీ కాకినాడ, అన్నవరం దేవస్థానాలకు తమ దళాలు భద్రత కల్పిస్తున్నట్లు శ్రీనివాసరావు వివరించారు.

పేదలకు వరం ‘జగనన్న సురక్ష’

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు


పాత ఇసుకపల్లిలో మహిళకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరంలో అందుతున్న సేవలను అక్కడి రోగులను ఆయన అడిగి తెలుసుకున్నారు. 11 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించి ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమం ఆరోగ్యం గురించి ఆలోచించిన కుటుంబం కేవలం వైఎస్సార్ కుటుంబం మాత్రమే అన్నారు. సర్పంచ్‌లు సన్నిబోయిన రిబ్కా, తమిలిశెట్టి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ గుర్రాల మంగతాయారు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎంపీడీఓ వెంకటనారాయణ వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. అచ్చంపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటికే వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది గడప గడపకూ వచ్చి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఆరోగ్య శిబిరాల ద్వారా వైద్య నిపుణులచే పరీక్షలు చేస్తున్నామన్నారు. 45 రోజుల పాటు జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ వ్యాధులకు సంబంధించి 450 మందికి వైద్య సేవలు అందించారని డాక్టర్ పి. ప్రశాంత్ తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు ప్రశాంత్, శ్రీహిమతి సేవలు అందించారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఎంఈఓ-2 పి.పుల్లయ్య, సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, ఎంపీటీసీ సభ్యుడు వింటి కృష్ణ, మాజీ సర్పంచ్ సలాది రమేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది.


అచ్చంపేటలో ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఎంపీపీ సత్తిబాబు

వైభవంగా ముగిసిన నవరాత్ర ఉత్సవాలు

- పాదగయ క్షేత్రంలో ఘనంగా శమీపూజ
- పురుహూతికా, రాజరాజేశ్వరి అమ్మవార్లకు ఘనంగా కుంకుమ పూజలు


పాదగయ క్షేత్రంలో పూజలు చేస్తున్న అర్చకులు


సామర్లకోటలో కనకదుర్గమ్మ విగ్రహ ఊరేగింపు


పాదగయ క్షేత్రంలో శమీపూజ చేస్తున్న భక్తులు

పిఠాపురం: ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన శరన్నవరాత్ర ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. పాదగయ క్షేత్రంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరిదేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పురుహూతికా దేవికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం అన్ని గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపులు కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ఉప్పాడ సముద్ర తీరంలో నిమజ్జనాలు చేశారు.

దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనం

సామర్లకోట: దేవీనవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానికంగా పలుచోట్ల ఉత్సవ మండపాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాలను బుధవారం గోదావరిలో నిమజ్జనం చేశారు. స్థానిక గాంధీచౌక్, బళ్ల మార్కెట్ సెంటర్, పాత్రుళ్లపేట, గణపతినగరం, కూరగాయల మార్కెట్, స్టేషన్ సెంటర్, రైల్వే క్వార్టర్స్‌లో కనకదుర్గమ్మ ఉత్సవ మండపాలు ఏర్పాటు చేశారు. ఇక్కడి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఉంచి పట్టణ పురవీధుల నుంచి ఊరేగింపు చేపట్టారు. అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

కొత్తపల్లి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలోని కనకదుర్గమ్మను బుధవారం ఘనంగా ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ధర్మశాస్తా ఆలయంలో కొలువైన కనకదుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొండెవరం, కోమరగిరి, గొర్స, యండపల్లి తదితర గ్రామాల్లో ముగింపు సందర్భంగా అమ్మవారిని ఊరేగించి ఉప్పాడ శివారు సుబ్బంపేట సమీపంలో ఉన్న తీరప్రాంతంలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.